మోత్కూరులో శాలివాహన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతర కృషి

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, మార్చి 9 : మోత్కూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని ముశిపట్లలో, మున్సిపాలిటీలోని పలు వాడల్లో సీసీ రోడ్లు, శాలివాహన భవన నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతర సుందరయ్య కాలనీలో స్పోర్ట్స్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బిక్కేరు బ్రిడ్జి వరకు డబుల్ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసిందన్నారు. పీహెచ్‌సీని 30 పడకల దవాఖానగా, పోస్టుమార్టం కేంద్రం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మంచినీటి అవసరాలకు రూ.10.40 కోట్లు కేటాయించారని, మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు రూ.1.75 కోట్లు మంజూరు చేశారని అన్నారు.

డబుల్ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాల తొలగింపు, కొత్తవి నాటేందుకు రూ.46లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, దబ్బేటి విజయ, కో ఆప్షన్ సభ్యులు ఆనందమ్మ, ఎండీ నబీ, నర్సయ్య పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- కవి, రచయిత జయరాజు



అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో కవి, రచయిత జయరాజు, భౌద్ధ భిక్షువు సారిపుత్ర బంతే

వలిగొండ, మార్చి 9 : భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కవి, రచయిత జయరాజు అన్నారు. మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో జై భీమ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో సాంఘిక అసమానతలు తొలగిపోయి ఆర్థిక సమానత్వం సాధించినప్పుడే అంబేద్కర్ ఆశయాలు సాకారమవుతాయన్నారు. కార్యక్రమంలో భౌద్ధ భిక్షువు సారిపుత్ర బంతే, బి.వెంకటయ్య, కంచి ముత్తయ్య, పురం ఆనంద్, వల్లమల్ల రఘుపతి, వాకిటి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ కీసర్ల ఉపేంద్ర సత్తిరెడ్డి, భిక్షపతి, వీరస్వామి పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- తెలంగాణ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు భిక్షపతి



చౌటుప్పల్ : గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

గుండాలలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మికులు

చౌటుప్పల్, మార్చి 9 : చేనేత కార్మికులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు కందగట్ల భిక్షపతి అన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చేనేత కార్మికులు శనివారం పట్టణంలో నిరసన తెలిపారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్, చేనేత మిత్ర, నగదు బదిలీ, కార్మికుల బీమా పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 11న హైదరాబాద్ టెస్కో ఆఫీసు వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం నర్సింహా, నాయకులు వనం ధనుంజయ, గోశిక స్వామి, గంజి మురళీధర్, పున్న వెంకటేశం, కాటబత్తిని భీమయ్య, బత్తుల చంద్రయ్య, దోర్నాల సత్తిబాబు, చక్రపాణి, వైకుంఠం, హరికృష్ణ, పురుషోత్తం, ధనుంజయ, సత్యనారాయణ, సురేశ్ పాల్గొన్నారు.

చేనేత పథకాలను యథావిధిగా కొనసాగించాలి

గుండాల, మార్చి 9 : చేనేత కార్మికుల కోసం గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను యథావిధిగా కొనసాగించాలని చేనేత సహకార సంఘం చైర్మన్ దుడుక ఉప్పలయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల పథకాలను కొనసాగిస్తూనే ఉపాధి కల్పించి తగిన వేతనాలు ఇప్పించాలని కోరారు. సోమవారం టెస్కో కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాకు చేనేత కార్మికులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు చుంచు సత్తయ్య, శ్రీపతి లక్ష్మీనారాయణ, మార్కండేయ, అంబదాస్, ఆంజనేయులు, సత్యనారాయణ, రమేశ్, గోపాల్, నర్సయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కళారూపాలు

ఆత్మకూరు(ఎం)లో చిన్నారుల సాంస్కృతిక కళా ప్రదర్శన

ఆత్మకూరు(ఎం), మార్చి 9 : మహా శివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం రాత్రి మాజీ ఎంపీపీ జెన్నాయికోడె అమృతమ్మ, శంకరయ్య స్మారకార్థం మండల స్థాయి పాఠశాలల సాంస్కృతిక కళారూపాలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ, ఎస్ఐ నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ కవిత, మాజీ సర్పంచ్ నగేశ్, నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో చలివేంద్రం ప్రారంభం

చౌటుప్పల్, మార్చి 9 : పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం పక్కన నాంపల్లి రాజయ్య, సావిత్రమ్మ జ్ఞాపకార్థం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహర్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయన్నారు.

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు దాచేపల్లి ప్రకాశ్, కటకం ప్రశాంత్, కొసనం రాంరెడ్డి, తిరందాసు జగన్, మొగుదాల రమేశ్, బొబ్బిళ్ల మురళి, కామిశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.

రేణికుంటలో వేంకటేశ్వరుడి క్షేత్రం

- తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో నిర్మాణం
- ఈ నెల 12 నుంచి 18 వరకు ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాలు

రేణికుంట గ్రామ శివారులో నిర్మించిన సంకల్ప సిద్ధి వేంకటేశ్వరాలయం

రాజాపేట, మార్చి 9 : మండల కేంద్రానికి సమీపంలో రేణికుంట గ్రామ శివారులో తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో సంకల్ప సిద్ధి వేంకటేశ్వరాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయాన్ని పూర్తిగా కంచి శిలతో పాటు ఆళ్లగడ్డ రాతితో మంచి కళానైపుణ్యంతో అద్భుతంగా తీర్చిదిద్దారు. రాజగోపురం, వేంకటేశ్వర గర్భాలయం, వరహాస్వామి ఆలయ పనులు పూర్తయ్యాయి. ఆలయం ముందు ఏకశిలతో చెక్కిన 51 అడుగుల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆలయాన్ని ఆకర్షణీయ రంగులతో తీర్చిదిద్దుతున్నారు. త్వరలోనే ప్రారంభం కానున్న ఈ ఆలయం మహిమాన్విత దివ్య పుణ్యక్షేత్రంగా విరాజిల్లనున్నది. ఈ నెల 12 నుంచి 18 వరకు పీఠాధిపతి శ్రీమాన్ బిక్కవోలు కేశవాచార్య దైవజ్ఞశర్మ, శ్రీమాన్ బీవీఆర్‌బీజీఆర్‌కే గౌతమ్‌కృష్ణ ఆధ్వర్యంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 17న మహా సంప్రోక్షణ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు.

కంచి శిలతో ఆలయ నిర్మాణం

రెయిన్‌బో డెవలపర్స్ ఆధ్వర్యంలో 2017లో వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ దేవాలయం కంచి శిలతోపాటు ఆళ్లగడ్డ రాతితో నిర్మించారు. స్వామి గర్భాలయంపై 31 అడుగుల విమాన గోపురం, అమ్మవార్ల గర్భాలయంపై 26 అడుగుల విమాన గోపురం, ప్రాకార మండపానికి ఉత్తర, దక్షిణంలో 25 అడుగుల రాజ గోపురాలు, మండపం ఎదురుగా మధ్యస్తంతో గరుడాలయం, మొదటి ప్రాకారంలో 36 అడుగుల రాజగోపురాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా రెండో ప్రాకారం తూర్పు వైపున ముఖ మండపం వద్ద 48 అడుగుల రాజగోపురం, మొదటి రాజగోపురం మధ్య దక్షిణం వైపు వకుల మాత, ఈ రెండు ప్రాకారాల నలువైపులా స్వామివారి మాఢ వీధి, వరహాస్వామి ఆలయం, ఆలయం ముందు భాగాన 51 అడుగుల ధ్వజస్తంభం దర్శనమిస్తుంది. స్వామివారి కోనేరు కూడా ఏర్పాటు చేశారు. మొదటి రాజగోపురం ఇరువైపులా 16 అడుగుల గరుత్మంతుడు, ఆంజనేయస్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. గర్భాలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు మహాబలిపురంలో ఉత్సవ విగ్రహాల తరహాలో తయారు చేయించారు. తిరుమల తిరుపతి తరహాలో సంకల్ప సిద్ధి వేంకటేశ్వరాలయం నిర్మాణం చేపట్టినట్లు ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు పేర్కొన్నారు.

అత్తింటి వేధింపులతో నవ వధువు ఆత్మహత్య

- పెండ్లి అయిన 20రోజులకే బలవన్మరణం
- చీమలకొండూరులో విషాదచాయలు

భూమిక (ఫైల్)

భువనగిరి కలెక్టరేట్, మార్చి 9 : వారిద్దరు ఒకరినొకరు ఇష్టపడ్డారు. కులాలు వేరైనా ఒకే ఊరుకు చెందినవారు కావడంతో పెద్దల సహకారంతో పెండ్లి చేసుకున్నారు. కానీ.. అత్తింటి వేధింపులకు ఆ అమ్మాయి మనస్తాపం చెందింది. కులం పేరుతో చిన్నచూపు చూడడాన్ని తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని చీమలకొండూరు గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు, మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీమలకొండూరు గ్రామానికి చెందిన పల్లెర్ల భూమిక (19), అదే గ్రామానికి చెందిన బిట్కూరి మనోహర్ ఒకరినొకరు ఇష్టపడ్డారు. కులాలు వేరైనా కలిసి బతుకుదామనే నిర్ణయంతో ఫిబ్రవరి 17న పెద్దల సహకారంతో పెండ్లి చేసుకుని ఒక్కటయ్యారు. ప్రేమించుకునేటప్పుడు అడ్డురాని కులం కాపురం చేసేటప్పుడు రావడంతో మనోహర్, అతని కుటుంబ సభ్యులతో భూమిక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నది. కులం పేరుతో దూషించడంతో మనస్తాపం చెందిన ఆమె ఈ నెల 2న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. భర్త, అత్త వేధింపులు తాళలేకపోతున్నానని తల్లిదండ్రులకు రోదిస్తూ తెలిపింది. ఈ క్రమంలో ఈ నెల 6న తీవ్ర మనోవేదనతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న భూమికను గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ భూమిక శనివారం మృతిచెందింది. దీంతో ఆగ్రహించిన మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు మనోహర్, అతని కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

'చట్టసభల్లో బీసీ వాటా సాధిద్దాం'

అమరవీరులు స్థూపం వద్ద మాట్లాడుతున్న నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 9 : జనాభా ప్రకారం చట్టసభల్లో బీసీ వాటా సాధిద్దామని బీసీ నాయకులు సాయిన నరేందర్, ఎం.నరేందర్ అన్నారు. బీసీ వాటా సాధన కోసం ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బీసీ మహా పాదయాత్ర శనివారం భువనగిరి పట్టణానికి చేరుకోగా స్థానిక అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ సమాజ నిర్మాణం కోసం, తెలంగాణ సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన బీసీలంటే నేడు ఎవరికీ లెక్క లేదన్నారు. 70 ఏండ్లుగా జనగణన కోసం, సమాన అవకాశాల కోసం బీసీలు ఎన్నో పోరాటాలు చేస్తున్నా దేశ పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్లి లలితక్క, మారోజు వీరన్న, శ్రీకాంతాచారి, సిరిపురం యాదయ్య, సాంబశివుడు, మహాత్మా జ్యోతిరావు పూలే వంటి వీరుల స్ఫూర్తితో ఉద్యమించి చట్టసభల్లో బీసీ వాటా సాధిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల సిద్ధేశ్వర్, ఎర్ర శ్రీహరి, కొంగ నరహరి పటేల్, వనజ, వనిత, భిక్షపతి, అరుణ, విమల, విశ్వపథి, శ్రావణ్‌కుమార్, రామ్‌ప్రసాద్, శ్రీను, బుచ్చిబాబు, బాలస్వామి, కుమార్ గాడ్గే, అజయ్ పటేల్, సుదర్శన్, పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

బీబీనగర్, మార్చి 9 : పురిటి నొప్పులతో బాధ పడుతున్న మహిళకు 108 సిబ్బంది అంబులెన్స్‌లో కాన్పు చేశారు. మండలంలోని చాడ గ్రామానికి చెందిన సలేంద్ర పూజకు పురిటి నొప్పులు రావడంతో భువనగిరి జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి ప్రసవం ఇబ్బందవుతుందని హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు 108 అంబులెన్స్‌లో పంపించారు. అంబులెన్స్‌లో వెళ్తుండగా.. మండలంలోని టోల్‌గేట్ వద్దకు రాగానే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఏంటీ రవికుమార్ మహిళకు అంబులెన్స్‌లోనే డెలివరీ చేశారు. ఆమె పండంటి కవల పిల్లలకు (ఒక మగ, ఒక అడ బిడ్డ) జన్మనిచ్చింది.

కాన్పు తరువాత తల్లీబిడ్డలను భువనగిరి దవాఖానకు తరలించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు. అంబులెన్స్‌లో సుఖ ప్రసవం చేసిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం

రామన్నపేట, మార్చి 9 : మండల కేంద్రానికి చెందిన గొరిగే మహేశ్ ఇటీవల మృతి చెందాడు. అతని మిత్రులు, లారీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు శనివారం మహేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.53,300 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మిరియాల మల్లేశం, బండ లింగస్వామి, మల్లా రవి, ఎగ్గె లింగస్వామి, వెంకటేశ్, శేఖర్, వెంకటేశ్, ప్రేమ్‌కుమార్, సురేశ్, రమేశ్ పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి 100 బ్యాగుల సిమెంట్ అందజేత

రామన్నపేట, మార్చి 9 : మండలంలోని పల్లివాడ గ్రామంలో నిర్మించతలపెట్టిన గంగాభవాని ఆలయ నిర్మాణానికి సింగిల్ విండో డైరెక్టర్ కల్లూరి సైదమ్మ 100 బస్తాల సిమెంట్‌ను అందజేశారు. ఇందుకు సంబంధించి శనివారం నిర్మాణ కమిటీకి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు దూదిమెట్ల సైదులు, పెద్దగొల్ల దండిగ పరమేశ్, మేకల భిక్షమయ్య, దండిగ నర్సింహ, నాగరాజు, మధు, లివేందర్ పాల్గొన్నారు.

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

రాజాపేట, మార్చి 9 : చింత చెట్టు పైనుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పారుపల్లిలో జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కడారు పర్వతాలు (48) హమాలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం గ్రామ శివారులోని చింత చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

భువనగిరి కలెక్టరేట్, మార్చి 9 : మహిళ మెడలోని పుస్తెల తాడును గుర్తు తెలియని దుండగులు అపహరించిన ఘటన మండలంలోని జమ్మాపురం గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు, బాధితురాలి వివరాల ప్రకారం.. జమ్మాపురం గ్రామానికి చెందిన చిన్నాబత్తిని లూసమ్మ శనివారం ఇంటి నుంచి బీబీనగర్ ఎయిమ్స్ దవాఖానకు వెళ్తుండగా జమ్మాపురం స్టేజీ వద్ద గుర్తు తెలియని ఇద్దరు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మోత్కూరు, మార్చి 9 : మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. గుండాల మండలం గంగాపురం గ్రామానికి చెందిన కాళి యాకస్వామి కుటుంబ సభ్యులతో కలిసి మహా శివరాత్రి పురస్కరించుకొని శుక్రవారం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టుకు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మోత్కూరు వైజే ఫంక్షన్‌హాల్ సమీపంలో కారు అతి వేగంతో అదుపు తప్పి చెట్టును ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కాళి లక్ష్మి, ఆమె కుమారుడు యాకస్వామి, కూతురు కావ్య, అల్లుడు శ్రీశైలం, తోటి కోడళ్లు భాగ్య, విజయకు గాయాలయ్యాయి. వీరిని 108లో జనగామ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

సిటిజన్స్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ

భువనగిరి అర్బన్, మార్చి 9 : పట్టణంలో శనివారం సిటిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా బట్టు రామచంద్రయ్య, బర్రె జహంగీర్, దొనకొండ రాములు, కన్వీనర్‌గా దర్గాయి నర్సింగ్ రావు, కో ఆర్డినేటర్‌గా బండారు రవివర్ధన్, కో కన్వీనర్లుగా కలకుంట్ల జయ, జి.శంకర్, బూడిద శ్రీహరి, సభ్యులుగా హీరాలాల్, భాస్కర్‌నాయక్, అన్నంపట్ల కృష్ణ, వద్దిగల దాసు, కె.లలిత, బర్రె నగేశ్, కృష్ణ, స్వామి ఎన్నికయ్యారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

వలిగొండ, మార్చి 9 : మండల కేంద్రంలోని వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మలబార్ డైమండ్ చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 38 మంది విద్యార్థులకు రూ.8 వేల చొప్పున స్కాలర్‌షిప్‌ను బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసిన ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు విక్రమ్‌బాబు, సోమశేఖర్, వెంకటాచారి, మురళి, విజయ్‌కుమార్, భిక్షం, రవి, సురేశ్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం

భువనగిరి కలెక్టరేట్ : శివశక్తి అనుగ్రహ మహాపీఠంలో పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, మార్చి 9 : మండలంలోని కొలనుపాక గ్రామంలో కుషంగుల మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద పట్నం వేసి ఒగ్గు కళాకారులు కల్యాణాన్ని నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అగ్నిగుండాలు నిర్వహించారు. భక్తులు శివనామస్మరణలతో అగ్ని గుండాలు తొక్కారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు భూమయ్య, గంగుల ఎల్లయ్య, శ్రీనివాస్, ఒగ్గు కళాకారులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లి శివాలయంలో ప్రభుత్వ విప్ ఐలయ్య పూజలు

భువనగిరి కలెక్టరేట్ : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన పూజల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుగ్రహ మహాపీఠంలోని బంగారు శివలింగానికి అభిషేకాలు చేపట్టారు. మండలంలోని నమాత్‌పలిలో స్వయంభూ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ చైర్మన్ అతికం లక్ష్మీనారాయణ గౌడ్ స్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండలంలోని గౌస్‌నగర్‌లో శుక్రవారం రాత్రి పంచాయతన రామలింగేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. శనివారం అన్నదానం నిర్వహించిన లింగమ్మ, కిష్టయ్య దంపతులను సన్మానించారు.

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం

భూదాన్ పోచంపల్లి : పట్టణంలో 101 యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. పూలతో అలంకరించిన రథంపై స్వామివారిని ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక బుగ్గ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శతఘటాభిషేకం నిర్వహించారు. మహిళలు శివలింగానికి జలాభిషేకం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, దేవాలయ చైర్మన్లు వంగూరి బాలకృష్ణ, కుడికాల భిక్షపతి, కౌన్సిలర్లు మోటే రజిత, భోగ భానుమతి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం

చౌటుప్పల్ : పట్టణంలోని గాంధీ పార్కులో అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి 50వ వార్షిక వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారి శోభాయాత్ర, ఎదుర్కోలు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, దేవాలయ కమిటీ అధ్యక్షుడు బొబ్బిళ్ల మురళి, ఉత్సవ నిర్వాహకులు కృష్ణ, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం

రామన్నపేట : మండలంలోని సిరిపురం గ్రామంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. గణపతి పూజ, ఎదుర్కోలు కార్యక్రమం అనంతరం మాంగళ్యధారణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. జడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్‌మోహన్ స్వామి, వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మహిళలు ఒడి బియ్యం పోశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాపోలు రమేశ్, ఎంపీటీసీ బడుగు రమేశ్, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు, మల్లారెడ్డి, రామేశ్వరం, నర్సిరెడ్డి, భాస్కర్, రామలింగం పాల్గొన్నారు.

ముశిపట్లలో బుగ్గ రామలింగేశ్వరస్వామి అగ్నిగుండాలు

మోత్కూరు : మండలంలోని ముశిపట్ల గ్రామంలో బుగ్గ రామలింగేశ్వర స్వామి గుట్టపై శనివారం అగ్ని గుండాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణం అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున భక్తులు స్వామివారిని మోసుకుంటూ అగ్నిగుండాలు తొక్కారు. మధ్యాహ్నం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మందుల సామేల్ స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, పైళ్ల సోమిరెడ్డి, నర్సిరెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : కొలనుపాకలో అగ్ని గుండం తొక్కుతున్న భక్తులు

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



బీబీనగర్ : పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి

బీబీనగర్, మార్చి 9 : మండలంలోని మహాదేవపురం గ్రామంలో అక్కన్న, మాదన్న దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శ్యామ్‌గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం రాత్రి జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దండెం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోలి నరేందర్‌రెడ్డి, సింగ